ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.7	29.5
కావలి	38	29
ఆత్మకూరు	39	30
ఉదయగిరి	40	29
కందుకూరు	38	29

సీనియర్లకు సముచితస్థానం

- ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ శివప్రసాద్
- ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాలేపాటి
- ఇద్దరూ పార్టీకి విధేయులే...

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ విధేయులకు టీడీపీ పట్టం కట్టింది. ఆదివారం రాత్రి ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు చెందిన మరో ఇద్దరు సీనియర్ నేతలకు రాష్ట్రస్థాయి చైర్మన్ పోస్టులను అధిష్ఠానం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ డాక్టర్ జడ్ శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాలేపాటి సుబ్బానాయుడు పదవులు దక్కించుకున్నారు. దీంతో పార్టీకి వీరవిధేయులుగా ఉన్న సీనియర్ నేతల జాబితాలోని మరో ఇద్దరికి పదవులు దక్కినట్లయింది.

నిబద్ధతతో పనిచేయడం జడ్‌ఎస్ ప్రత్యేకత



నెల్లూరు నగర నియోజకవర్గానికి చెందిన డాక్టర్ శివప్రసాద్ మొదటి నుంచి టీడీపీలో ఉన్నారు. పార్టీ ఏ పని అప్పజెప్పినా నిబద్ధతతో పూర్తి చేయడం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా పార్టీ పెద్ద కార్యక్రమాల్లో వైద్య సేవలన్నింటినీ ఆయనే పర్యవేక్షిస్తుంటారు. ప్రస్తుతం టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. వివాదరహితుడిగా శివప్రసాద్ గుర్తింపు పొందారు. జిల్లాలోని ముఖ్య నేతలందరితోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయన పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కీలకంగా పనిచేశారు. 2014లో నెల్లూరు నగర మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం చివర్లో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా నియమితుల య్యారు. అయితే తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కువ కాలం ఆ పదవిలో కొనసాగలేక పోయారు. అయితే తాజాగా జలమార్గాలను అభివృద్ధి చేసే కీలకమైన ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా నియమితులయ్యారు.

మాలేపాటి కుటుంబమంతా పార్టీ సేవలోనే...



కాగా కావలి నియోజకవర్గానికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడు మొదటి నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఆయన కుటుంబం మొత్తం పార్టీకి విధేయతగా పని చేస్తోంది. గతంలో దగదర్తి మండలాధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. 2019-24 మధ్య కాలంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను చేపట్టారు. అనేక ఇబ్బందులు ఎదురైనా కేడర్‌ను కాపాడుకోవడంలో మాలేపాటి సక్సెస్ అయ్యారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో కావలి టికెట్‌ను ఆశించారు. అయితే టికెట్ దక్కకపోయినా పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో కావలిలో పార్టీ గెలుపు కోసం పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాలేపాటి కొనసాగుతున్నారు. తాజాగా వ్యవసాయ యాంత్రీకరణలో కీలకమైన ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. దీంతో ఇద్దరు సీనియర్ నాయకులకు గుర్తింపు లభించినట్లుగా పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు.

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం

- పెంచలో.. గోవిందా.. మారుమోగిన కోన గిరులు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం



పెంచలకోనలో ఆదివారం రాత్రి జరిగిన శ్రీవారి గరుడసేవ

కొండాకోనా.. ఎటుచూసినా భక్తజనం... ఎవరినోట విన్నా పెంచలో... గోవిందా..! అనే నామస్మరణే. భక్తకోటి పిలుపుతో పెనుశిల నృసింహుడు పరవశించిపోయాడు. ఆదివారం రాత్రి స్వర్ణమయకాంతులతో వెలిగిపోతున్న గరుత్మంతు డిపై కొలువుదీరిన శ్రీవారు అశేష జనవాహినిని కటాక్షించారు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు.



కోనలో శ్రీవారికి నిర్వహించిన సింహవాహన సేవ

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కోన కిక్కిరిసింది. క్షేత్రంలో పాత భవనాలు కూల్చివేయడంతోపాటు పలుచోట్ల రహదారుల వెడల్పుచేయడం, ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతోపాటు విస్తృతంగా చలువ పందిళ్ల వేయడంతో భక్తులు సేద తీరారు. పలువురు తలనీలాలు సమర్పించుకుని పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. మరికొందరు అన్నదానం చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేపినాపి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

సింహవాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పరిమళ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సింహవాహ నంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వ హించారు. ఉదయం నుంచి ఆలయంలో శ్రీవార్లకు హోమాలు, స్నపనతిరుంజనం, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవలు జరిగాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఆకట్టుకున్నాయి.

బంగారు గరుడుడిపై ఊరేగింపు

పెనుశిల లక్ష్మీనరసింహుడు ఆదివారం రాత్రి తన ఇష్ట వాహనమైన బంగారు గరుడుడిపై ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న పెంచలస్వామి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, వెంకటరామయ్య, హజరత్ నాయుడు, తోట కిష్టయ్య, భార్గవరాం, నరసింహరావు, సుగుణమ్మ, నరసింహులు తదితరులు ఉన్నారు. ఆదివారం రాత్రి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు ఆర్డీవో నగసంతోషి అనూష స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కాగా బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం తిరు కల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు.

రెండు ప్రమాదాలు.... 65 మందికి గాయాలు

- కూలి పనులకు వెళుతూ ట్రక్కు ఆటో అదుపు తప్పి 30 మందికి...
- బాధితులంతా కందుకూరు వాసులు
- కోనకు వెళుతుండగా ట్రక్కు బోల్తాపడి 35మందికి గాయాలు
- క్షతగాత్రులంతా అన్నమయ్య జిల్లా వాసులు

జిల్లాలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 65 మంది గాయపడ్డారు. కందుకూరు- పొన్నలూరు మార్గంలో ట్రక్కు ఆటో బోల్తాపడి కందుకూరుకి చెందిన 30 మంది కూలీలు గాయపడ్డారు. కాగా పెంచలకోన బ్రహ్మోత్సవాలకు వెళుతుండగా, జరిగిన ప్రమాదంలో 35 మంది అన్నమయ్య జిల్లా వాసులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..



కందుకూరు- పొన్నలూరు మార్గంలో బోల్తా పడిన ట్రక్కు ఆటో

కందుకూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు - పొన్నలూరు రహదారిలో ముత్తరాసుపాలెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కందుకూరుకి చెందిన 30మంది కూలీలు గాయపడ్డారు. వ్యవసాయ పనుల కోసం కూలీలు వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగింది. పరిమితికి మించి కూలీలను ఎక్కించుకోవడం, అతివేగం కారణంగా వాహనం బోల్తా పడిందని గాయపడ్డ కూలీలు, ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఆ సమయంలో వాహనంలో ఉన్నవారంతా గాయపడగా ఎవరికీ ప్రాణాపాయం లేదు. గాయపడ్డ కూలీలందరిని కందుకూరు ఆసుపత్రిలోనూ, పట్టణంలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.



కందుకూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

కోనకు వెళుతూ...

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం గోనుపల్లి గ్రామం వద్ద సుమారు 35 మందితో ప్రయాణిస్తున్న ట్రక్కు ఆటో బోల్తా పడి పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం పెరియారవరం గ్రామానికి చెందిన పెంచలస్వామి భక్తులు కోన బ్రహ్మోత్సవాలకు వస్తుండగా, రాపూరు మండలం గోనుపల్లి వద్ద మోటార్ బైక్‌ను తప్పించబోయి ట్రక్కు ఆటో తిరగబడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న సుమారు 35 మందికిపైగా గాయాలు కాగా, 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో శివయ్య (42), రాధమ్మ (30), నారాయణమ్మ (60) పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి జిల్లా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాపూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



గోనుపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడినవారు

బిల్లులు రాక... భూసేకరణ లేక !

- నిలిచిన సోమశిల ఆప్రాన్ పనులు... కదలని హైలెవల్ కెనాల్ వర్క్స్
- ఈ రెండూ అత్యవసరమే..
- ప్రభుత్వానికి జిల్లా అధికారుల నివేదిక
- మంత్రి ఆనం చొరవతో చాబోలుకు జీవం


సోమశిల ఆప్రాన్ సమాచారం	
ఎస్టిమేషన్ విలువ	: రూ.99.11 కోట్లు
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 40 శాతం
పనులు చేసిన మొత్తం	: రూ.35 కోట్లు(సుమారు)
చెల్లించిన బిల్లులు	: రూ.22 కోట్లు
పెండింగ్ బిల్లులు	: రూ.13 కోట్లు(సుమారు)
పనులు ఆగడానికి సమస్య	: బిల్లుల పెండింగ్

హైలెవల్ కెనాల్ ఫేజ్-2 సమాచారం	
ఎస్టిమేషన్ విలువ	: రూ.532.98 కోట్లు
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 35 శాతం
పనులు చేసిన మొత్తం	: రూ.201 కోట్లు
చెల్లించిన బిల్లులు	: రూ.5.47 కోట్లు
పెండింగ్ బిల్లులు	: రూ.195 కోట్లు
పనుల జాప్యానికి కారణం	: భూసేకరణ

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన సోమశిల ఆప్రాన్, హైలెవల్ కెనాల్‌కు నిధులు, భూసేకరణే ప్రధాన సమస్యలుగా మారాయి. బిల్లుల పెండింగ్‌తో ఆప్రాన్ పనులు పూర్తిగా నిలిచిపోగా, భూసేకరణ సమస్యతో హైలెవల్ కెనాల్ పనులు ముందుకు సాగలేదు. జిల్లాకు జీవనాడి అయిన సోమశిల జలాశయం రక్షణకు ఆప్రాన్ పనులు పూర్తి చేయడం అత్యవసరం. అలాగే హైలెవల్ కెనాల్ పూర్తి చేయడం ద్వారా ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయి.

నివేదించినా స్పందనేది ?

2020, 2021 సంవత్సరాల్లో పెన్నానదికి భారీగా వరదలు రావడంతో సోమశిల ఆప్రాన్ దెబ్బతింది. అప్పట్లోనే దాన్ని పరిశీలించిన నిపుణుల కమిటీ అత్యవసరంగా ఆప్రాన్ పునఃనిర్మాణం చేయాలని సూచించింది. 2022లో రూ.99.11 కోట్లతో పనులు మొదలుపెట్టారు. రూ.20 కోట్ల పనులు జరిగాక అప్పటి వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. ఏడాది పాటు మళ్లీ ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా సోమశిలను పరిశీలించడంతో మళ్లీ పనులు ప్రారంభమ య్యాయి. ఈ మధ్యలో మరో రూ.12 కోట్ల మేర పనులు జరిగాయి. అయితే మళ్లీ బిల్లుల సమస్య ఏర్పడింది. కొన్ని నెలలుగా పెండింగ్ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఆప్రాన్ పనులు అత్యవసరంగా చేపట్టాల్సి ఉందని, రూ.70 కోట్ల బడ్జెట్ కేటాయించాలని జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.



వరదలకు దెబ్బతిన్న సోమశిల ఆప్రాన్(ఫైల్)

మంత్రి ఆనం చొరవతో కదలిక

ఈ ఫేజ్-2 కిందే చాబోలు రిజర్వాయర్‌ను నిర్మించాల్సి ఉండగా, ఆ ప్రాజెక్టు పనులు అసలు మొదలుకాలేదు. దీంతో ఈ వర్కును రద్దు చేశారు. అయితే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవ తీసుకోవడంతో ఈ వర్కు రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. హైలెవల్ కెనాల్‌కు 3482 ఎకరాలను సేకరించాల్సి ఉండగా, 1200 ఎకరాలను ఇప్పటి వరకూ సేకరించారు. మరో 2257 ఎకరాలకు సేకరించాల్సి ఉంది. 2025-26 బడ్జెట్‌లో ఈ భూసేకరణకు రూ.50 కోట్లను కేటాయించారు. అయితే ఈ మొత్తం సరిపోదని, మరో రూ.70 కోట్లు అవసరమవుతుందని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రస్తుతం కేటాయించిన రూ.50 కోట్ల మేరకైనా అధికారులు భూసేకరణ వేగంగా పూర్తి చేయాల్సి ఉంది.

రూ.195 కోట్ల బిల్లులు పెండింగ్

సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-2 కింద రూ.532.98 కోట్లతో 2020లో పను లు మొదలుపెట్టారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే రెండు బ్యాలెన్సింగ్ రిజర్వా యర్లను నిర్మించాల్సి ఉంది. ఈ కెనాల్ పూర్తయితే దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, మర్రిపాడు మండలాల్లో 46,453 ఎకరాలు సాగులోకి వస్తాయి. అలానే ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా తీరుతుంది. ఇప్పటి వరకూ 35 శాతం మేర పనులు జరగ్గా రూ.200 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం రూ.195 కోట్ల వరకూ పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది.

నర్సింగ్ సేవలు అమోఘం

- వైద్యచికిత్సల్లో వారిదే కీలకపాత్ర
- అత్యవసర రోగులకు సేవలతో గుర్తింపు
- ఫ్లోరెన్స్ నైటింగేల్ వారికి ఆదర్శం
- జిల్లాలో 6,500 మందికిపైగా సిస్టర్స్
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నెల్లూరు (వైద్యం) మే 11 (ఆంధ్రజ్యోతి): వైద్యచికిత్సల్లో నర్సులు చేస్తున్న సేవలు అద్వితీయం... అమోఘం. రోగులకు వైద్య చికిత్సలతో పాటు అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. వీరు అందించే సేవలతోనే వ్యాధిగ్రస్థులు పూర్తిస్థాయిలో కోలుకుంటున్నారు. కుష్ఠువ్యాధి, టీబీ, హెచ్ఐవీ బాధితులకు సైతం నర్సులు అందించే సేవలే ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎంతోమంది అనారోగ్య బాధితులు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినవారు, అఖరికి గర్భిణుల ప్రసవాల సమయంలోనూ నర్సుల చూపిస్తున్న చొరవ వారికి ఎంతో గుర్తింపునిస్తుంది. కరోనా సమయంలో నూ ప్రాణాలను తెగించి సేవలందించారు. ప్రపంచంలోనే తొలినర్సుగా ప్రాచుర్యం పొందిన ఫ్లోరెన్స్ నైటింగేలే వీరికి ఆదర్శం. మొదటి ప్రపంచయుద్ధంలో క్షతగాత్రుల గాయాలను శుభ్రపరిచి, వైద్యసేవలు అందించిన నర్సుగా నైటింగేల్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. ఈ సేవలకు గుర్తింపుగా ఆమె జయంతి రోజైన మే 12న (నేడు) ప్రపంచ నర్సింగ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు.

● 6,500మందికిపైగా నర్సులు

జిల్లావ్యాప్తంగా 6,500 మందికిపైగా నర్సులు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో సేవలు అందిస్తున్నారు. వైద్య చికిత్సలో 80 శాతం ఈ నర్సులే కీలకపాత్ర పోసిస్తున్నారు. శస్త్ర చికిత్సలలోనూ వైద్యులకు సహాయకారులుగా ఉంటున్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి 52 పీహెచ్‌సీలు, 494 విలేజ్ హెల్త్‌క్లినిక్ ఉండగా, ఇందులో 494 మంది బీఎస్సీ నర్సింగ్ చదివిన నర్సులు సేవలు అందిస్తున్నారు. సచివాలయాల్లో కూడా 700 మంది నర్సులు సేవలు అందిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని 52 పీహెచ్‌సీల్లో 1000 మందికిపైగా నర్సులు ఉన్నారు. వైద్య విధానపరిషత్‌కు సంబంధించి ఆత్మకూరుజిల్లా ఆసుపత్రితో పాటు రెండు ఏరియా ఆసుపత్రులు. 10 సీహెచ్‌సీలు ఉండగా, అందులో 180 మందికిపైగా స్టాఫ్ నర్సులు వైద్యసేవలు అందిస్తున్నారు. ఇక నగరంలోని జీజీహెచ్‌లో 300 మంది స్టాఫ్‌నర్సులు పనిచేస్తున్నారు. ఇక ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి 1500 ఆసుపత్రులు జిల్లాలో ఉండగా అందులో నాలుగు వేలమందికి పైగా పనిచేస్తున్నారు. కొంత మంది తాము చేస్తున్న సేవలకు ప్రత్యేక గుర్తింపు పొందుతూ ప్రభుత్వం నుంచి గుర్తింపు పురస్కారాలు అందుకుంటున్నారు.



నర్సుల సమస్యలు పరిష్కరించాలి



కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నా నేటికి పరిష్కరించ లేదు. సీనియారిటీ ప్రాతిపదికన ప్రాధాన్యత ఇవ్వాలి. 38 ఏళ్లుగా నర్సుగా సేవలు అందిస్తున్నా. ఫ్లోరెన్స్ నైటింగేల్ మాకు ఆదర్శం. ఆమె అడుగు జాడల్లోనే నడుస్తాం. కరోనాతో సమయంలో ఎంతోమంది నర్సులు చనిపోయినా వెరవ కుండా రోగులకు చికిత్సలు అందిస్తూనే ఉన్నాం. వృత్తిరీత్యా సేవ చేయడం మహాభాగ్యంగా భావిస్తున్నాం.

- సత్యవతి, హెడ్‌నర్సు, జీజీహెచ్, ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

ఎంతో సంతృప్తిగా ఉంది...



34 ఏళ్లుగా నర్సింగ్ సేవలు అందిస్తున్నా. సాధారణ రోగులకు వైద్య సేవలు అందిస్తూ ప్రమాదకరంలో ఉన్న రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాం. వారు కొంత వరకు కోలుకుంటే మాకు ఎంతో సంతృప్తిగా ఉంటుంది. ఆ తరువాత వైద్యులు అందించే చికిత్సకు తోడుగా రోగుల వద్ద కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఓర్పుతో వైద్యసేవలు అందిస్తున్నాం.

- వరలక్ష్మి, జీజీహెచ్, హెడ్‌నర్సు

వేదగిరిపై వెలిగిన అఖండజ్యోతి

మోహినీ అవతారంలో

లక్ష్మీనరసింహుడు



వేదగిరి క్షేత్రంలో వెలిగించిన అఖండజ్యోతి



మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహుడు

నెల్లూరురూరల్, మే 11,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదగిరిలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు ఉదయం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరణ మందిరంలో స్వామివారిని మోహినీ అవతారంలో పరిమళ భరిత పుష్పాలతో అలంకరించి, పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు నరసింహకొండకు చేరుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద అఖండజ్యోతిని వెలిగించిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కొత్త బస్సుల జోరు

- జిల్లాకు 133 సర్వీసుల రాక
- కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన ప్రయాణం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక నెల్లూరు ఆర్టీసీ రీజియన్‌కు కొత్త బస్సులు వెల్లువలా తరలి వస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కాలం చెల్లిన బస్సులతోనే పాలకులు నెట్టుకొచ్చారు. కొత్తబస్సులు అవసరమని అధికారులు పదేపదే ఇండెంట్లు పెట్టగా, ఐదేళ్లలో రెండు బస్సులను మాత్రమే పంపారు. అయితే గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు నెల్లూరు రీజియన్‌కు 133 కొత్త బస్సులను కేటాయించింది. నెల్లూరు-1 డిపోకి 31 సర్వీసులు, నెల్లూరు-2 డిపోకి 19, ఆత్మకూరుకి 9, కందుకూరుకి 25, కావలికి 12, రాపూరుకి 7, ఉదయగిరికి 30 సర్వీసులు వచ్చాయి. దీంతో ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడినట్లు అయింది.



గత గురువారం జిల్లాకు వచ్చిన కొత్త ఆర్టీసీ బస్సులు

డిపోల వారీగా వచ్చిన బస్సులు

డిపో	సూపర్‌లగ్జరీ	అల్ట్రా డీలక్స్	ఎక్స్‌ప్రెస్
ఆత్మకూరు	3	-	6
కందుకూరు	22	2	1
కావలి	5	-	7
నెల్లూరు-1	27	3	1
నెల్లూరు-2	9	5	5
రాపూరు	2	-	5
ఉదయగిరి	15	-	15
మొత్తం	83	10	40

కోవూరులో ఆడమూరు పీఠాధిపతి

కోవూరు, మే11 (ఆంధ్రజ్యోతి): ఉడిపి అష్టపీఠాల్లో భాగమైన ఆడమూరు పీఠాధిపతి ఈశాప్రియ తీర్థ ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక మైథిలికూడలి నుంచి ప్రారంభమైన పాదయాత్ర శాంతినగర్ వరకు కొనసాగింది. పారిశుధ్య కార్మికులు నెలకొల్పిన పోలేరమ్మ ఆలయంలో అనుగ్రహ పోషణ చేశారు. పడు గుపాడు సొసైటీ రైతులతో మాట్లాడారు. పొబ్బారెడ్డి మల్లికార్జున రెడ్డి గోశాలలో ఆవుకు వసుప్రదగా నామకరణం చేశారు. కార్యక్రమంలో సుభాష్‌సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు, ధర్మసింధు అధ్యక్షుడు దన్వి శ్రీనివాస్, పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రైతు నాయకులు విజయసాయిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురళీ త్యాగాన్ని దేశం మరువదు

● ఎంపీ వేమిరెడ్డి దంపతులు ● వీర జవాన్‌కు ఘననివాళి

నెల్లూరు (హరనాథపురం/స్టోన్‌హౌస్‌పేట/విద్య), మే 11 (ఆంధ్రజ్యోతి) : మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని దేశమంతా గుర్తు పెట్టుకుంటుందని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు అన్నారు. ఆదివారం నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో శత్రుమూకలతో పోరాడి వీర మరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని వారు కొద్దిసేపు మౌనం పాటించారు. మురళీ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కోడూరు కమలా కర్‌రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి, ముంగర గోపాల్, యాకసిరి వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు. కాగా, పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలువురు నివాళులర్పించారు.



మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి దంపతులు

● బీజేపీ నాయకులు నెల్లూరు చిన్నబజార్‌లోని పార్టీ కార్యాలయంలో మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, మురళి, హేమంత్, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు. కాగా, అపరేషన్ సింధూర్ విజయవంతమైనందుకు బీజేపీ నాయకులు మాగుంట లేఔట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, నాయకులు అడపాల మదన్‌సాయిరెడ్డి, చిలకా ప్రవీణ్‌కుమార్, చలువాది కిరణ్‌కుమార్, గంట విజయశ్రీ పాల్గొన్నారు.

● నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులకు పౌష్టికాహారం అందించారు. మహిళా స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జవాన్‌కు నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

నిమిషం నిబంధనతో..

- నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
- జిల్లాలో 65 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 24,835 మంది విద్యార్థులు

నెల్లూరు(విద్య), మే 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడి యట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 12 (నేటి) నుంచి 20వతేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు. ఇందుకుగాను ఏర్పాట్లు పూర్త య్యాయన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 65 కేంద్రాల్లో పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తామన్నారు. నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. పరీక్ష లకు ప్రథమ సంవత్సరంలో 21,068 మంది, ద్వితీయ సంవత్సరంలో 3,767 మంది కలిపి మొత్తం 24,835 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ప్రథమ సంవత్సరానికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరానికి మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామ న్నారు. నిబంధనల ప్రకారం ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమంతించమని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి కూడా ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐవో వరప్రసాద్‌రావు, డీఈసీ సభ్యులు

● కట్టుదిట్టంగా నిర్వహణ

పరీక్షలకు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు హైపవర్ కమిటీతో పాటు జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ హైపవర్ కమిటీలో కలెక్టర్, ఎస్పీ, డైరెక్టర్, ఇంటర్‌బోర్డు ఆర్జేఈడీ, డీవీఈవో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారని ఆర్ఐవో తెలిపారు. అలాగే జిల్లా పరీక్షల కమిటీలో ఆర్ఐవోతో పాటు కన్వీ నర్, సభ్యులు ఎప్పటికప్పుడు పరీక్షలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇప్పటికే ఈ పరీక్షలకు సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించి కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ సమస్యలు, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రవాణా సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మంచినీటితోపాటు వైద్య సదుపాయాలను కల్పించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు.

● కేంద్రాల్లో నిబంధనలు

పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లను అనుమతించబోమని పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, కస్టోడియన్ ఎవరి వద్ద కూడా మొబైల్స్ ఉండకూడదన్నారు. బోర్డు మంజూరు చేసిన బేసిక్ మోడల్స్ మొబైల్స్ మాత్రమే వాడాల్సి ఉంటుం దని తెలిపారు. ఫీజు చెల్లించలేదని ఎక్కడైనా విద్యార్థులకు హాల్‌టికెట్లు నిరాకరిస్తే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరిం చారు. పరీక్షల నిర్వహణ సమాచారం పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూములో ఫోన్ 0861-2320312 నెంబరు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు బ్లాక్ చేయడం తగదు

● ఏపీటీఎఫ్

నెల్లూరు(విద్య), మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఖాళీ పోస్టులను బ్లాక్ చేస్తూ విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేయడం సరికాదని ఏపీటీఎఫ్ నేతలు అన్నారు. నెల్లూరులోని ఆ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తూ కూడా ఖాళీలను బ్లాక్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సుదూర ప్రాంతాల్లో ఎంతో కాలం నుంచి పని చేస్తున్న ఉపాధ్యాయులకు దీనివలన నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు ఏడు ఎస్ఏ పోస్టులను మంజూరు చేయాలని, ఒక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను వేరొక మోడల్ స్కూల్‌లో కలిపినపుడు పిల్లలతోపాటు ఉపాధ్యాయులను కూడా కలపాలని సూచించారు. రోల్‌తో సంబంధం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలకు హెచ్ఎం పోస్టును మంజూరు చేస్తూ సమాంతర మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి, కార్యదర్శి ఎం పిచ్చిబాబు, గౌరవాధ్యక్షుడు వీ శివకోటారెడ్డి, నేతలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీసు తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రతా చర్యల్లో భాగంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదే శాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆక స్మిక తనిఖీలు కొనసాగిస్తు న్నారు. ఆదివారం సాయం త్రం 4 నుంచి 6 గంటల వరకు ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసులు, బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో జల్లెడ పట్టారు. ప్రయాణికుల గుర్తింపు కార్డులు, ప్రయాణ గమ్యం, ఉద్దేశాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. లగేజీ బ్యాగులు, ఇతర వస్తువులను తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరరిక్షణే ధ్యేయంగా జిల్లాలోని 14 రైల్వే స్టేషన్లు, 14 ఆర్టీసీ బస్టాండ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశామని చెప్పారు. అక్రమ రవాణాను అడ్డుకోవడం, శాంతిభద్రతలకు ముప్పుగా మారే అసాంఘిక శక్తులను గుర్తించడమే లక్ష్యమన్నారు. ప్రజలు అనుమానితులను గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నెల్లూరులో కారు బీభత్సం

నెల్లూరు(క్రైం), మే 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర రోడ్లపై ఓ కారు అతివేగంగా దూసుకుపోతూ అడ్డువచ్చిన వాహనాలు ఢీకొంటూ బీభత్సం సృష్టించింది. సేకరించిన సమాచారం మేరకు... నగరంలోని ఆత్మకూరు బస్టాండు నుంచి ఆదివారం రాత్రి ఓ తెల్ల ఇన్నోవా కారు అతివేగంగా శెట్టిగుంట రోడ్డు, ఓల్డ్‌చెక్‌పోస్టు వైపు దూసుకు వచ్చింది. దానిని ఆపేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రయత్నించినా కారు డ్రైవర్ ఆపలేదు. ఓల్డ్ చెక్‌పోస్టు వద్ద కారును ఆపేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రయత్నిస్తే అతని పైకి కారును పంపి మైపాడు గేటు వైపు పరుగులు తీయించాడు. చివరిగా ప్రశాంతి నగర్ జాతీయ రహదారి సమీపంలో కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే గర్భిణి మృతి

- ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన
- పోలీసుల రాకతో సద్దుమణిగిన గొడవ

నెల్లూరు (వైద్యం), మే 11 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా కాన్పు సమయంలో జ్యోతిప్రియ అనే గర్భిణి మృతి చెందిందంటూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన ఆదివారం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. విడవలూరు మండలం దండిగుంట గ్రామానికి చెందిన వెంకట ప్రసాద్ అల్లూరు మండలం గద్దగుంట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన సతీమణి జ్యోతిప్రియ(24)ను రెండవ కాన్పు కోసం నగరంలోని ఓ ఆసుపత్రికి తీసుకువచ్చారు. సిజేరియన్ చేసి ఆడ శిశువును కుటుంబ సభ్యులకు అప్పగించారు. పాప ఆరోగ్యంగా ఉండ గా తల్లి తీవ్ర అనారోగ్యానికి గురవడంతో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కాన్పు చేసిన ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలు సుకున్న పోలీసులు వచ్చి గొడవను సద్దు మణిగేలా చేశారు. ఉమ్మనీరు ఎక్కువగా పోవటం, ఇతర ఇబ్బందుల వల్లే గర్భిణీ ప్రసవానంతరం మృతి చెందిందని వైద్యులు వివరించారు. అనంతరం కుటుంబ సభ్యులు మృత దేహాన్ని తీసుకుని వెళ్లారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

మనుబోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని సంగమేశ్వర గిరిజనకాలనీకి చెందిన పెద్దమణి (70) ఆదివారం వడ దెబ్బతో మరణించాడు. నాలుగురోజులుగా మండిపోతున్న ఎండలకు కోలుకోలేక పోయినట్లు స్థానికులు తెలిపారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అన్నదమ్ములను బలిగొన్న రోడ్డు ప్రమాదం

● నెల్లూరు వాసికి తీవ్రగాయాలు

నల్లచెరువు/కదిరి, మే11(ఆంధ్రజ్యోతి): ముగ్గురు అన్నదమ్ములు. వేర్వేరు ఉద్యోగాలు చేసి, రిటైరయ్యారు. శేష జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. బంధువు, వరుసకు తమ్ముడు మరణించడంతో కడచూపు చూసేందుకు వెళ్లారు. అంత్యక్రియలు ముగించుకుని, తిరుగు ప్రయాణమయ్యారు. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఆ ముగ్గురు అన్నదమ్ములను కబళించింది. శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి వద్ద ముంబై-చెన్నై రహదారి పక్కన ఆపివున్న వ్యాన్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన అన్నదమ్ములు నాగేంద్ర (63), చలపతి (75), జయచంద్ర (70) దుర్మరణం చెందారు. వారి బంధువు, నెల్లూరు నగరానికి చెందిన వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆయనను 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.



నుజ్జయిన కారులో అన్నదమ్ముల మృతదేహాలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	140
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276

కోడిగుడ్ల ధర (100) : 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9316
వెండి కిలో ధర	రూ. 99,100
వెండి ఒక గ్రాము	రూ.102.10

ఉత్తర కాలువకు నీటి విడుదల పెంపు

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు విడుదల చేస్తున్న నీటి మోతాదును ఆదివారం పెంచారు. 30 నుంచి 100 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 49.706 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. దక్షిణ కాలువకు 50, పెన్నాడెల్టాకు 4,030 క్యూసెక్కులు కొనసాగుతున్నాయి.

రూ.8లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేత



షకీలాకు రూ.8 లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందచేస్తున్న టీడీపీ నేతలు

కావలి, (ఆంధ్రజ్యోతి): నోటిక్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ షకీలాకు చికిత్స నిమిత్తం ముందస్తు సహాయం కింద రూ.8లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో షకీలాకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, గంగినేని వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. చెక్కు అందచేసిన ఎమ్మెల్యేకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

కుట్టు శిక్షణ మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

కావలి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో 3నెలలు శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిధులు మాట్లాడారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలు నేర్చుకున్న నైపుణ్యంతో పనిచేసుకుంటూ జీవనోపాధి పొందాలన్నారు. అరగల ఉదయ భాస్కర్ పేద మహిళ జీవనోపాధికి కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కందికట్టు నారాయణ తల్లి హైమావతమ్మ జ్ఞాపకార్థం సంస్థలో చదువుతున్న విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అజిత్‌బాబు, ప్రసాదరావు, ఖాదర్‌బాష, శివప్రసాద్, కుట్టు శిక్షణా ట్రైన్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

● ఒకరు మృతి - పలువురికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో షేక్ నిస్సార్ మృతదేహం

వలేటివారి పాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఒకరు మృతి చెందిగా పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చుండి జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదం లో అనంతపురం జిల్లా పెనుగొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన షేక్ నిస్సార్ (60) అక్కడికక్కడే మృతిచెందగా కారులో ఉన్న సంపూర్ణతో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు విజయవాడ నుంచి అనంతపురం వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. కారులో మొత్తం 11 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న వలేటివారిపాలెం ఏఎస్‌ఐ బ్రహ్మయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, క్షతగాత్రులను 108లో కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

గుడ్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని మోచర్ల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు... ఉలవపాడు మండలం చాగొల్లుకు చెందిన దుగ్గిరాల వెంకటేశ్వర్లు (45) శనివారం మండలంలోని మోచర్లలో వారి బంధువుల అంత్యక్రియలకు హాజరై రాత్రికి ద్విచక్ర వాహనంపై చాగొల్లుకు తిరిగి వెళ్తుండగా నెల్లూరు వైపు నుంచి ఒంగోలుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో వెంకటేశ్వర్లు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

వాస్తవం తెలియకుండా ఆరోపణలు తగదు

● మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): విజయ గణపతి స్వామి..వైసీపీ నేతలు చేసినవి అసత్య ఆరోపణలని మనసా..వాచా కర్మణ ప్రమాణం చేస్తున్నానని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలు బజారులోని విజయగణపతి ఆలయంలో మాలేపాటి నాగేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి స్వామి సన్నిధిలో ప్రమాణం చేశారు. నీరుచెట్టు పనుల నుంచి వచ్చిన డబ్బుతో ఇల్లు, సిమెంటు దుకాణం, బ్రాంది షాపు పెట్టానని చెప్పడం విచారకరం అన్నారు. క్రమశిక్షణ గల టీడీపీలో పనిచేస్తున్నామని అన్యాయాలు, అక్రమాలకు పాల్పడే నాయకులు ప్రోత్సహించరని చెప్పారు. తాము ప్రజాప్రయోజనాల కోసం పనిచేసే సీఎం చంద్రబాబునాయుడు బాటలో నడిచే ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి వెంట నడిచే సైనికులం అన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నేతలు వెంకటేశ్వరరెడ్డి, వెంకయ్య, రఘురాం నాయుడు, వెంకటేశ్వర్లు, సుధీర్ బాబు, ప్రభాకర్, సుధాకర్‌యాదవ్, విజయ్ కుమార్ యాదవ్, ఆదిశేషయ్య, పద్మలత ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

● మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి



గుడ్లూరులో అంబేడ్కర్ విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలు సాధించాలని, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డాలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. మండల కేంద్రమైన గుడ్లూరులో స్థానిక అంబేడ్కర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన అంబేడ్కర్ విగ్రహన్ని ఆయనతో పాటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు ఆదివారం ఆవిష్కరించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో బడుగు బలహీన వర్గాలు ఎంతో కొంత అభివృద్ధి సాధిస్తున్నారంటే, అది అంబేడ్కర్ పుణ్యమేనన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ చేసిన రాజ్యాంగ రూపకల్పన ద్వారానే సమాన హక్కులు పొందగులుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి మాల కార్పోరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, ఎంపీపీ పులి రమేష్, గ్రామ సర్పంచ్ పాలకీర్తి శంకర్, బండి గోవిందయ్య, బద్దిపూడి జయరావు, ఉపాధ్యాయులు వెంకట్రావు, మేకపోతుల రాఘవయ్య, కావలి ఏసుదాస్, పత్రె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి కృషి చేయాలి



పెదపవని జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

లింగసముద్రం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపవనిలోని భళేరావు జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ముత్తినేని మాల్యాద్రి కోరారు. ఆదివారం 1993-98 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైస్కూల్‌కు వాటర్ డిస్పెన్సరీని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధనుం మాధవరావు, మధుబాబు, కె సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బిట్రగుంట వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల రక్షణ కోసం యుద్ధభూమిలో వీరమరణం పొందిన వీర జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని బిట్రగుంట వాకర్స్ అసోసి యేషన్ సభ్యులు నివాళులర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. బోగోలు మండలం రైల్వే బిట్రగుంట ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు బర్నాడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు స్పర్జన్‌రాజ్, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్‌వాకర్స్ సత్యనారాయణ, సుధాకర్, శ్రీనివాసులు, మాస్టర్ రవిగస్, శ్యాంసుధాకర్ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యులకు సత్కారం



రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యులను సత్కరిస్తున్న ప్రముఖులు

కావలిటౌన్, మే11(ఆంధ్రజ్యోతి) రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యత్వం స్వీకరించిన సభ్యులను ఆదివారం రెడ్‌క్రాస్ ప్రధాన వైద్యాధికారి బెజవాడ రవికుమార్ మినీస్టేడియం మైదానంలో సత్కరించారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాల్లో భాగంగా ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించి రక్తపోటు మధుమేహం, సంబంధిత వ్యాధుల గురించి అప్రమత్తత అవసరం అని అవగాహన కల్పించారు. ఉచిత రక్తగ్రూప్ పరీ క్షలు హిమగ్లోబిన్ శాతం, రక్తపోటు షుగర్ పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు నివారణకు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్షం చేస్తే మెదడులో రక్తస్రావంతో పాటు పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందన్నారు. మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులపై ఎప్పటికపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో అనేకమంది వాకర్స్ రక్తదానం చేశారు. ఇటీవల రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యత్వం తీసుకున్న ఉమాచంద్, జయ చంద్రా నాయుడు, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, చిన్నిజాన్, జనిగర్ల మనోహర్ యాదవ్, వెంకట శేషాచలపతిలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైస్ చైర్మన్ హరనారపరెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రావు, శ్రీధర్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం



గిరిజనులకు అన్నదానం చేస్తున్న పయ్యావుల

ఆత్మకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలో ఆదివారం ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజనులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐక్య ఫౌండేషన్ చైర్మన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి మాట్లాడుతూ పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన శివుని రమణమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు చల్లా రవీంద్రారెడ్డి సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యడ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, కార్తీక్‌చౌదరి, తూమాటి శ్రీధర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త పెంచలమ్మ, ఐక్య ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000-2001లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పది పూర్తిచేసి 25ఏళ్ల పూర్తవుతుండగా పాఠశాలలో కలసినవారు ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించు కుంటూ అప్పటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్య నేర్పించిన గురువులకు సత్యం, శ్రీనివాసరెడ్డి, శ్యామలను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు 6 ఫ్యాన్లు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

సంగం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్ల నాగవరపమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర మహోత్సవంలో భాగంగా రెండవ రోజు ఆదివారం చండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి గణపతి, మహాన్యాస పూర్వక అభిషేకాలు తదితర పూజలతోపాటు చండీయాగం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీతారాముల గ్రామోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగంపల్లి కోదండరాముని ఆలయంలో వార్షిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా శనివారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సీతారామ లక్ష్మణ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

వైభవంగా హనుమంతసేవ

వింజమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో నీలగిరి పర్వతంపై వున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి హనుమంత సేవ కార్యక్రమం వైభవంగా జరిగింది. పడమటివీధి వారు ఉభయ కర్తలుగా స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ పాలక మండలి చైర్మన్ ఎల్‌సీ కొండారెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, టీడీపీ పటిష్టతకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



టీడీపీలోకి చేరిన వైసీపీ శ్రేణులతో ఎమ్మెల్యే కాకర్ల

సీతారామపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితో పాటు పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, గంగవరం, పోలంగారిపల్లి, దేవమ్మచెరువు, బసినేనిపల్లి గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రామసభలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల హాజరుకాగా గ్రామాలలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామసభ నిర్వహించి మండల, గ్రామ నాయకుల సమక్షంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి అజెండా టీడీపీని బలోపేతం చేయడమేనని తెలిపారు. కాగా, అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలో కాకర్ల సురేష్ సమక్షంలో 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సంగసానిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గురవయ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మాజీ కన్వీనర్ మొత్తంశెట్టి చెన్నకేశవులు, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004- 05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హెచ్‌ఎం నాయబ్ రసూల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గురువులను సన్మా నించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ముందుగా సర్వేపల్లి రాధా కృష్ణన్, సరస్వతిదేవి చిత్రపటాలకు పూల మాలలు వేశారు. కార్య క్రమంలో ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీని వాసులు, విశ్రాంత ఎంఈవో గానుగపంట ఓబుల్‌రెడ్డి పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అహ్మద్‌బాషాకు జాతీయ స్థాయి పదవి

ఉదయగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్థాన ఖాదరీయా సంస్థాన అధ్యక్షుడు షేక్ అహ్మద్‌బాషాకు జాతీయ స్థాయి ఎబయస్‌యస్‌సి స్వచ్ఛంద సంస్థలో ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీరులో శనివారం జరిగిన సదస్సులో అహ్మద్‌బాషా సంస్థ చైర్మన్ సయ్యద్ నసిరుద్దీన్ చిష్టి జారీచేసిన ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఆయన శిష్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

50 మంది యువత రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్లు

ఆత్మకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కెకెఆర్ ఆసుపత్రి ప్రాంగణంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌస్‌బాష కుమారుడు షేక్ తౌహీద్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయన మిత్రులు స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మహ్మద్ సాదిక్ హుస్సేన్, వైస్‌చైర్మన్ చంద్రా వెంకటసుబ్బానాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 50 మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం స్థానిక బిఎస్ఆర్ సెంటర్‌లో 250 మందికి బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై మీరామోహిద్దీన్, డాక్టర్ బి శివకృష్ణ, ప్రభుత్వ జిల్లా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవాని అమ్మవారికి అభిషేకాలు

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవనగరం జమ్మిన గుంటలో నూతనంగా వెలసిన భవాని అమ్మవారి ఆలయంలో ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. 14 రోజుల వేడుకల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అబ్దుల్ అజీజ్‌కు సన్మానం

వింజమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు షేక్ షరీఫ్, చంద్రపడే సాగునీటి సంఘం అధ్యక్షుడు వేమూరి దొరస్వామి నాయుడు నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వింజమూరు మండల సమస్యలను ఆయనకు వివరించారు.

ఘనంగా గంగమ్మకు పాలపొంగళ్లు



పొంగళి సామగ్రితో ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు

ఉదయగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో జలాశయం వద్ద నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో భక్తులు ఆదివారం అమ్మవారికి పాల పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పొంగళి సామాగ్రిని కొత్త బుట్టల్లో పెట్టుకొని బాణాసంచా పేలుళ్ల, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ఆలయ ప్రదక్షిణల అనంతరం పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మంత్రి ఆనం చేతుల మీదగా చెక్కును అందుకుంటున్న పంచేటి శ్రీనివాసులు

చేజర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గంలోని 22 మందికి రూ. 37,25,213 చెక్కుల రూపంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 205 పేద కుటుంబాలకు 2కోట్ల 60లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఘనంగా గంగమ్మకు మహా కుంభాభిషేకం



కుంభాభిషేకం చేస్తున్న అర్చకులు

సంగం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడులో ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో పోతురాజు, పోలేరమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖర మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. కుంభాభిషేక జలాల కోసం భక్తులు ఆలయం చుట్టూ బారులు తీరి జలాలను తలపై చల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దగ్ధం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమనిచిరవెళ్లలో శనివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో ఆదివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఈవిషయం గురించి డిస్కం ఏఈ సురేష్‌బాబును వివరణ కోరగా.. ఏసీల వినియోగం ఎక్కువ కావడంతో సమస్య ఏర్పడిందన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించామన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100) : 500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9154
వెండి కిలో ధర	రూ. 96,900
వెండి ఒక గ్రాము	రూ.99.90

'ఆత్మకు అన్వయించుకున్నప్పుడే బ్రహ్మజ్ఞాని'

నెల్లూరు (సాంస్కృతికం), మే 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదిశంకరాచార్య సంస్మరణ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం కఠోపనిషత్‌పై 5వరోజు ప్రవచనం చేశారు. బ్రహ్మజ్ఞాని కావాలనుకునేవాడు జీవాత్మ, పరమాత్మలను గుర్తించి శరీరంలోని ఆత్మకు అన్వయించుకోవాలని ఆదిశంకరాచార్యులు చెప్పారని గంభీరానందస్వామి తెలిపారు. ఉదయం అభిషేకాలు, అర్చన, సాయంత్రం కుప్పచ్చి అరుణ బృందం కచేరీ ఆకట్టుకున్నాయి. సర్వేపల్లి శ్రీనివాసరావు, వెంకట నరసింహం, రామమూర్తి, సురేష్‌కుమార్, సుధాకర్, ముదివర్తి లక్ష్మీకామాక్షి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎంపీ వేమిరెడ్డికి ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), మే 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు రావాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం వీపీఆర్ నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

నారాయణ సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభం

నెల్లూరు(విద్య), మే 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఐదో డివిజన్ ఫైపాడురోడ్డు ప్రశాంతినగర్‌లో ఆదివారం నారాయణ సీబీఎస్ఈ పాఠశాలను ఆ విద్యాసంస్థ జీఎం వీ విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. అన్నీ వసతులు, అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో ఈ పాఠశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. వచ్చేనెల అడ్మిషన్లు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రయోజనాలు

నెల్లూరు (వైద్యం), మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆ పార్టీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావ్ తెలిపారు. ఆదివారం నగరంలోని పలు డివిజన్లలో పార్టీ సభ్యత్వ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. సభ్యత్వంతో రూ. 5 లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువుకు ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు వంటివి లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్‌కుమార్, కంచికృష్ణ, కవలకుంట భాస్కర్, హరీష్, సుధా, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ప్రతిభ కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (సాంస్కృతికం), మే 11 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ప్రతిభ సర్వసభ్య సమావేశం ఆదివారం చిల్డ్రన్స్ పార్కు ఎన్‌కేఫ్‌లో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చీదెళ్ల రూపేష్, ఉపాధ్యక్షుడిగా మురిగిపూడి సతీష్‌కుమార్, కార్యదర్శిగా వాకాటి నరేంద్ర, కోశాధికారిగా అనుమాలశెట్టి లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రామమోహన్, మెంటా మురళీ, రాజా చంద్ర, రాఘవేంద్ర, వరదా శ్రీధర్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి):పెంచలకోన బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఆదివారం రాపూరు మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాపూరు- పెంచలకోన ఎర్రచెరువు వద్ద ఉన్న మామిడి చెట్టు కింద కార్యక్రమం చేపట్టారు.

- కలువాయి:దాచూరులో ఆదూరుపల్లి మీదుగా వెళ్లే వాహనదారులకు సర్పంచు రాజుల అనురాధ, ఫెస్టివల్ కమిటీ సభ్యుడు సోమయ్య అన్నదానం చేశారు.

ఒకరికి గాయాలు

వెంకటాచలం, మే11(ఆంధ్రజ్యోతి):కసుమూరు సమీపంలో ఆదివారం జరిగినరోడ్డు ప్రమాదంలో గూడూరు కరిముల్లా గాయపడ్డారు. పనినిమిత్తం కసుమూరుకు మోటార్ బైక్‌పై వచ్చి తిరిగి వెళుతుండగా హైస్కూల్ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. గాయపడిన బాధితుడిని పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చెప్పులు పంపిణీ

తోటపల్లిగూడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోడూరు పంచాయతీ రవీంద్రపురంలోని గిరిజనులకు ఆదివారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు చెప్పులు పంపిణీ చేశారు. ముందుగా సింధూర పేరుతో పాకిస్థాన్‌లో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భవానీ, శ్రీహరి పాల్గొన్నారు.

సాయితేజ అంత్యక్రియలు

బుచ్చిరెడ్డిపాళెం, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీపాళెంలో విద్యుత్‌షాక్‌తో మరణించిన చిలకా సాయితేజ అంత్యక్రియలు ఆదివారం తల్లి, బంధువుల మధ్య జరిగాయి. తీర్థయాత్రలకు వెళ్లిన తల్లీకొడుకు మృతి సమాచారంతో అన్నవరం నుంచి వెనుదిరిగి తెల్లారేసరికిబుచ్చి మార్చురీలోని కొడుకు మృతదేహం వద్ద విలపించారు.

చలివేంద్రం ఏర్పాటు

పొదలకూరు, మే11 (ఆంధ్రజ్యోతి):పంచాయతీ బస్టాండ్‌లో సాయిబాబా మందిర సెక్రటరీ నాగిశెట్టి దామోదరం మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించారు. వెంకటేశ్వర బోర్‌వెల్స్ అధినేత వెంకటేశ్వర్లు, కోమల క్యాటరింగ్ అధినేత వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ దేవరం రఘురామిరెడ్డి, కోశేటి వెంకటప్రసాద్, తుమ్మల శ్రీనివాసులు, శ్రీనివాసులు, కృష్ణమనాయుడు, భాస్కర్, చిరంజీవి, మనోజ్, రాజేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలోనే మందుల దహనం

- రసాయనిక పొగతో స్థానికుల ఆందోళన

నెల్లూరు (వైద్యం), మే 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట ఆనుకుని ఉన్న కొండదిబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రంలో కాలం చెల్లిన మందులను ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలోనే కాల్చివేశారు. వాటి నుంచి రసాయనాల వాసన కలిగిన పొగ వ్యాపించడంతో చుట్టుపక్కల వారు బెంబేలెత్తి బయటకు పరుగులు తీశారు. ఆ తర్వాత విషయం తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. కాలం చెల్లిన మందులను దూరంగా తీసుకెళ్లి కాల్చాల్సి ఉంటుంది. అయితే ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలోనే వాటిని కాల్చటంతో మందుల్లోని రసాయనాలతో కూడిన వాసన వ్యాపించింది. రోగులకు మందులను సకాలంలో అందచేసి ఉంటే పెద్ద మొత్తంలో మిగిలిపోయేవికావంటూ స్థానికులు విమర్శిస్తున్నారు.



కొండదిబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రం, (ఇన్‌సెట్) మందులు దహనం చేసిన ప్రాంతం

రంగడికి స్వర్ణ గరుడసేవ



నెల్లూరు (సాంస్కృతికం), మే 11 (ఆంధ్రజ్యోతి) : నరసింహ జయంతి సందర్భంగా ఆదివారం తల్పగిరి రంగనాథస్వామికి బంగారు గరుడసేవలో నగరోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా విశేష అలంకరణ, అనంతరం గోపురోత్సవం నిర్వహించారు.. రంగనాయకుల పేట గోపురం వీధి, శెట్టిగుంట రోడ్డు, లక్ష్మీపురం మీదుగా విజయభేరి అపార్ట్‌మెంట్‌కు నగరోత్సవం చేరింది. అపార్ట్‌మెంట్ వద్ద ఉభయకర్త రాజా హజరత్‌బాబు, నళిని కుటుంబ సభ్యులు స్వామి వారి విశేష పూజలో పాల్గొన్నారు. అనంతరం స్టోన్‌హౌస్ పేట, పప్పులవీధి, శెట్టిగుంటరోడ్డు మీదుగా దేవస్థానానికి ఉత్సవం చేరింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

ఇస్కాన్‌లో నరసింహ జయంతి

నగరంలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాత్రి నరసింహ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, పూజలు, భజనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశానేజ ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి, నరసింహ అవతారంపై ప్రవచనం చేశారు. అనంతరం భజనలు చేశారు.. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అరవపాళెంలో నూతన పార్కు: మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మే 11,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని బోడిగాడితోట సమీపానున్న అరవపాళెంలో నూతన పార్కును ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం ఎన్ఎంసీ కమిషనర్ నందన్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానికులంతా తమ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడంతో ఈ మేరకు స్పందించారు. ఇక్కడున్న ఎకర స్థలంలో అధునాత వసతులతో చిల్డ్రన్స్ పార్కు తరహాలో నూతన పార్కు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో పార్కు అవసరం ఉందని వెల్లడించారు. అనంతరం చిల్డ్రన్స్ పార్కు వద్ద ఈ-ఆటోలను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్క్ ఏర్పాటుకు సూచనలిస్తున్న మంత్రి నారాయణ

క్రికెటర్‌గా కమిషనర్ నందన్

నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ కాసేపు క్రికెటర్‌గా మారారు. బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. దీంతో అక్కడున్న వారంతా కేరింతలు కొడుతూ సిక్స్... సిక్స్... అంటూ ప్రోత్సాహానిచ్చారు. ఇందుకు నగరంలోని ఎస్వీజీఎస్ మైదానం ఆదివారం వేదికైంది. కార్పొరేషన్‌లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు మేడే సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలను సీఐటీయూకి చెందిన కార్మిక సంఘం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ తొలుత బ్యాటింగ్ చేశారు. ఎర్రటి ఎండలో రెగ్యులర్ క్రీడాకారుడిగా మారారు. తనదైన శైలిలో రెండు ఫోర్లు కొడుతూ పోటీదారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)


బ్యాటింగ్ చేస్తున్న కమిషనర్ నందన్

కనుల పండువగా

గిన్నెభిక్ష వేడుక

- ఘనంగా విశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేట అన్నపూర్ణదేవి, విశాలక్ష్మీ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, అనంతరం గిన్నెభిక్ష ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. రాత్రి నందిసేవ నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా పెనల సుధాకర్, పద్మకుమారి, వేమూరి కిషోర్ కుమార్, అరుణలత వ్యవహరించారు. ఈ ఉత్సవాలను పత్తి జయ రామయ్య, ఆడిటర్ రాఘవేంద్రరావు, కొలపర్తి రమేష్‌కుమార్, కామేశ్వర రావు, ఈవో దర్గయ్య, తదితరులు పర్యవేక్షించారు.

గాంధీనగర్‌లో నేడు సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), మే 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహాత్మా గాంధీ నగర్ కృష్ణమందిరం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుంది. ఈ కార్యక్రమం ఉదయం 9గంటలకు మొదలవుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

'జనసేన' మాతృదినోత్సవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 11 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నాయకురాలు గునుకుల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం మాతృదినోత్సవాన్ని నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. చిల్డ్రన్స్‌పార్క్ వద్ద ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ చలివేంద్రం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా నాయకురాళ్లు శ్యామల, లక్ష్మీ కుమారి, పసుపర్తి సుజాత, చల్లా కవిత, తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అనంతరం మహిళలతో జనసేన నాయకులు

తెలుగు బాప్టిస్టు చర్చిలో..

నెల్లూరు (సాంస్కృతికం), మే 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట ది తెలుగు సెకండ్ బాపిస్టు చర్చిలో ఆదివారం మదర్స్‌డే నిర్వహించారు. సంఘ కాపరి శామ్యూల్ కిషోర్ తల్లి సలోమి శాంసన్‌ను ఘనంగా సత్కరించారు. క్వయర్ బృందం ప్రత్యేక విభావరి చేశారు. ఉప సంఘ కాపరి మోసెస్, చైర్మన్ ఉరందూరు సురేంద్రబాబు, వైస్ చైర్మన్ ఆర్ అరిగప్ప, కార్యదర్శి ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీ పీ సృజనీ ఆనంద్ దంపతులు పాల్గొన్నారు.

గంగమ్మకు కుంభాభిషేకం

సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడులో ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


పెంచలకోనలో శ్రీవారికి నిర్వహించిన సహస్రదీపాలంకరణ సేవ


కోన ఆలయం వద్ద భక్తుల కోలాహలం


శ్రీవారిని దర్శించుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు


సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

టెరరిస్టులు దొరుకుతారు.. కాకాణి చిక్కడం లేదే..!

- గోవర్ధన్ అజ్ఞాతవాసంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చమక్కులు

మనుబోలు, మే 11 (ఆంధ్రజ్యోతి):గురివిందపూడి గ్రామదేవత ఓసూరమ్మ ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకంను ఆవిష్కరించారు. రూ.14లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు ముందు కొచ్చిన దాతలు ముప్పలశెట్టి రమేష్ బాబు, ఆడిపూడి శ్రీ హరిరెడ్డిలను అభినందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పాకిస్థాన్ టెరరిస్టులైనా దొరుకుతున్నారు కాని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎక్కడున్నాడో పోలీసులకు అంతుచిక్కడం లేదని ఎమ్మెల్యే చమత్కరించారు. గోవర్ధన్ రెడ్డి మోస్ట్ ట్యాలెంటెడ్. దోపిడీలు, అక్రమాలు చేయడంలో నెంబర్‌వన్ అన్నారు. ఆయన చేసిన పాపాలకు 25మంది అధికారులు, ఉద్యోగులు బలైపోయారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, వద్దినేని మస్తాన్‌నాయుడు, మధు నాయుడు, చెన్నూరు సుధీర్ రెడ్డి, శివకుమార్‌శర్మ, శ్రీహరి రెడ్డి, నాగేశ్వరరావు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.


ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వైభవంగా అళఘునాథుడి కల్యాణం

విడవలూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పార్లపల్లిలో వెలసిన మహాలక్ష్మీదేవి సమేత అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులోభాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఉత్సవానికి బద్వేలు సుబ్బారెడ్డి, సతీమణి జ్యోతి కుటుంబసభ్యులు సోహినిరెడ్డి, సుజాతమ్మ, హరిప్రసాద్‌రెడ్డి, సతీమణి అనురాధ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కల్యాణ అనంతరం గజవాహనసేవ నిర్వహించి ఊరేగింపు చేపట్టారు. వేడుకలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, పూండ్ల ఏసోబు, సత్యవోలు సత్యంరెడ్డి పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి):పంచేడు గ్రామ పరిధిలోని రూ.2.80కోట్లతో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. సబ్‌స్టేషన్ కోసం పెనాక అమరనాథరెడ్డి భూమి ఇవ్వడం అభినందనీయమన్నారు. కుడితిపాళెంలో కల్యాణ్‌రెడ్డి చొరవతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి కావస్తుందన్నారు. అనంతరం సభ వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్‌ను పరిశీలించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందుగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళీనాయక్‌తో పాటు సింధూర్‌తో ప్రాణాలర్పించిన వారి ఆత్మశాంతికి కొంతసమయం మౌనం పాటించారు. అనంతరం మాతృదేవోభవ స్ఫూర్తితో మహిళలందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, ఎంపీటీసీ కీర్తన, సర్పంచులు పూజిత, పెంచలయ్య, రామానాయుడు, శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు

ఇందుకూరుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల కోసం కూటమి నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణారెడ్డి, బొద్దుకూరు సుధాకర్, పెనుబల్లి కృష్ణచైతన్య, అవినాష్‌రెడ్డిలు ఆదివారం గంగపట్నం చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, పీఎల్‌రావు, సుధాకర్‌రెడ్డి, దొడ్ల మల్లికార్జున్‌రెడ్డి, మొగలయ్య, శ్రీనివాసులు, వెంకట్రావు, రాంబాబు, చంద్ర, మహేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోవూరు, మే11 (ఆంధ్రజ్యోతి): పాటూరులో 30ఏళ్ల కిందట పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అప్పటి తెలుగు ఉపాధ్యాయురాలు రామసుబ్బమ్మ, పీఈటీ విక్టర్, హాస్టల్ వార్డన్ పర బ్రహ్మంలను సన్మానించారు. అప్పటి వార్డెన్ రచించిన సంక్షేమ సౌరభాలు- జీవిత సత్యాలు పుస్తకాల్ని అందజేశారు.

టీడీపీలో చేరనున్న మన్నెమాల?

మనుబోలు, మే 11(ఆంధ్రజ్యోతి): గురివిందపూడి గ్రామ సర్పంచు భర్త మన్నెమాల సుధీర్‌రెడ్డి గురివిందపూడి గ్రామ దేవత కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు బొకే ఇవ్వడంతో అందరూ అవాక్కయ్యారు. మన్నెమాల టీడీపీలో చేరబోతున్నారా అంటూ చర్చించుకున్నారు. గ్రామ కాంగ్రెస్ నాయకుడిగా.. వైసీపీ స్థాపించిన కొద్దినెలలకే ఆ పార్టీలో చేరారు. రెండుదఫాలుగా కాకాణి గెలుపొందడంలో గ్రామం తరఫున కీలకపాత్ర పోషించాడు. గ్రామ నాయకులు సమ్మతితో మన్నెమాల సైకిలెక్కేందుకు రూట్ క్లియర్ అయినట్లు తెలిసింది.

రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన మూడో విడత నామినేటెడ్ పదవుల భర్తీలో తిరుపతికి చెందిన కూటమి నాయకులను మూడు కార్పొరేషన్ పదవులు వరించాయి. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) చైర్‌పర్సన్‌గా సుగుణమ్మ, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీహెచ్‌డీసీ) చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా డాలర్ దివాకర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతికి మూడో విడతలో మూడు పదవులు

- ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా సుగుణమ్మ
- ఏపీహెచ్‌డీసీ చైర్మన్‌గా పసుపులేటి హరిప్రసాద్
- తుడా చైర్మన్‌గా డాలర్ దివాకర్ రెడ్డి


సుగుణమ్మ

● మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ 2019 ఎన్నికల్లో రెండోసారి టికెట్ దక్కించుకుని స్వల్ప మెజారిటీతో ఓటమిచెందారు. అప్పటి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వైసీపీ అరాచకాలపై పోరాడుతూ వచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు జనసేన పార్టీకి పోవడంతో తొలుత నిరుత్సాహపడినా విజయం కోసం శ్రమించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇంచార్జి హోదాలో ఉంటూ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సభ్యత్వ నమోదులోనూ తిరుపతిని టాప్‌టెన్‌లో ఉంచారు. ఆమె కష్టాన్ని గుర్తించిన పార్టీ అధిష్టానం కీలకమైన ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చింది.

● జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. పదేళ్లుగా జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సారథ్య బాధ్యతలు నిర్వర్తించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించి నిరాశపడినప్పటికీ పార్టీ ఆదేశాల మేరకు పనిచేశారు. జనసేన కోటా నుంచి ఏపీహెచ్‌డీసీ పదవిని దక్కించుకున్నారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలోనూ ఈయన చురుగ్గా పనిచేశారు.


హరిప్రసాద్


దివాకర్

● 2024 ఎన్నికల ముందు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విజయం కోసం శ్రమించిన డాలర్ దివాకర్ రెడ్డి తొలి నుంచీ తుడా చైర్మన్ పదవికోసం దృష్టి పెట్టారు. ఆదిశగా పావులు కదిపారు. దీనిపై తీవ్ర పోటీ ఉన్నప్పటికీ అన్ని అవాంతరాలను తొలగించుకుని ఎట్టకేలకు తుడా పీఠం దక్కించుకున్నారు. 'వైసీపీ పాలనలో తుడాను ఒక నియోజకవర్గానికే పరిమితం చేశారు. అలా కాకుండా తుడా పరిధి జిల్లా మొత్తం ఉందని, అవసరమైన చోట తుడా నిధులను వెచ్చించేందుకు ప్రయత్నిస్తాను' అని డాలర్ దివాకర్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

కుప్పం నుంచి మరొకరికి..!

- ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్‌గా రాజశేఖర్



కుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా ఎస్.రాజశేఖర్ నియమితులయ్యారు. పాకాల సమీపం అగ్రహారంలోని రైతు శివయ్య కుమారుడైన ఈయన 20 ఏళ్ల కిందట కుప్పం మండలం కంగుందిలో స్థిరపడ్డారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం దగ్గరి బంధువు కూడా. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉంటూ అమరావతిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్నారు. అప్పుడప్పుడూ కుప్పం వచ్చి కుటుంబ వ్యవహారాలు చక్కబెట్టి వెళ్తుంటారు.

పద్మావతి ఆలయ డిప్యూటీఈవోగా హరీంద్రనాథ్

- రిటైర్డ్ అధికారులను రిలీవ్ చేస్తూ ఉత్వర్వులు జారీ

తిరుమల, మే11(ఆంధ్రజ్యోతి): తిరుమల రిసెప్షన్ డిప్యూటీఈవో ఆర్2గా ఉన్న హరీంద్రనాథ్‌ను తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీఈవోగా నియమిస్తూ టీటీడీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్2గా ప్రస్తుతం డిప్యూటీఈవో ఆర్1గా ఉన్న భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక, పద్మవతి అమ్మవారి ఆలయ ఇన్‌చార్జి డిప్యూటీఈవోగా ఉన్న గోవిందరాజన్‌కు పూర్తిస్థాయిలో హెచ్‌ఆర్ డిప్యూటీఈవోగా బాధ్యతలు కేటాయించారు. విష్ణునివాసంలో డిప్యూటీఈవోగా ఉన్న విజయ్‌కుమార్‌ను టీటీడీ ప్రెస్ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈస్థానంలో తిరుపతి పద్మావతి అతిథిగృహాల డిప్యూటీ ఈవోగా ఉన్న లక్ష్మణ్‌నాయక్‌ను నియమించారు. కాగా, శ్రీవారి ఆలయ డిప్యూటీఈవోగా పలువురు సీనియర్ అధికారులు విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. తమకు అవకాశమివ్వాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు తెలిసింది. త్వరలో మరికొంతమంది డిప్యూటీఈవోల బదిలీలు, ఏఈవోల పదోన్నతులపైనా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

● ఇక, ముగ్గురు విశ్రాంత అధికారులను టీటీడీ నుంచి రిలీవ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. వీరివల్ల ప్రస్తుత అధికారులకు పదోన్నతులు లభించడం లేదంటూ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో గత వైసీపీ ప్రభుత్వంలో దుకాణాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జున.. ఇప్పటికీ ఈవో కార్యాలయ ఓఎస్డీగా కొనసాగుతున్నారు.రిటైరైనా కొనసాగింపుపై విమర్శలు రావడంతో రిలీవ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ప్రెస్ విభాగం ఆఫీసర్ రామరాజు కూడా పదవీ విరమణ చేసినా కొనసాగుతున్న క్రమంలో ఆయన్నూ తప్పించారు. విగ్రహాల తయారీ విభాగం నుంచీ మరో అధికారిని కూడా రిలీవ్ చేసినట్టు సమాచారం.

మాతంగుల హంగామా





- గంగజాతరకు పెరిగిన సందడి

తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): తలకు పసుపుగుడ్డను జడలా కట్టి, కొప్పిముడి వేసుకుని మల్లిపూలు చుట్టుకున్నారు. శరీరమంతా గంధం పూసుకుని చీర, రవిక ధరించారు. మెడలో పూలహారం వేసుకున్నారు. ముఖానికి ఎర్రని బొట్టుపెట్టుకున్నారు. ఇలా.. తిరుపతి గంగజాతరలో ఆదివారం మాతంగి వేషధారణతో భక్తులు హంగామా చేశారు. పలకలు వాయిస్తూ, కొమ్ములు ఊదుతూ ఉంటే మాతంగి వేషగాళ్లు లయబద్ధంగా చిందులు వేసుకుంటూ వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. మరోవైపు తిరుపతి గంగజాతరలో సందడి పెరిగింది. భక్తుల వేషాలు ఊపందుకున్నాయి. మాతంగి వేషంలో మగరాయుళ్లు గంగమ్మకు భక్తితో ప్రణమిల్లారు. వేశాలమ్మ, తాళ్లపాక పెదగంగమ్మ, అంకాళమ్మ తదితర ఆలయాల్లోనూ జాతర సందడి కనిపించింది. తాతయ్యగుంట గంగమ్మకు అధికార, అనధికార ప్రముఖులు ఆలయానికి వచ్చి సారెలు అందజేశారు

నేడు సున్నపు కుండలు: మహిళలపై అత్యాచారం చేస్తున్న పాలేగాడిని గంగమ్మ సంహరించాక తిరుపతికి మేమున్నాం... అంటూ పెదగంగమ్మ, చినగంగమ్మ సున్నపు కుండలు కట్టుకుని అంతటా తిరిగి పూజలందుకుంటారు. పాలేగాళ్ల బాధ ఉండదంటూ భరోసా ఇస్తారు. అప్పటి నుంచి తిరుపతి జాతరలో గంగమ్మ వంశస్థులైన కైకాల కులస్థులు ఈ సున్నపు కుండల వేషాలను ధరించడం ఆచారంగా వస్తోంది. ఇలా సోమవారం సున్నపుకుండల వేషంలో ఉన్న ఇద్దరు కైకాల కులస్తులు పూజలందుకుంటారు. భక్తులు వివిధ వేషాలతో అమ్మవార్లను దర్శించుకుంటారు.









గంగమ్మ ఆలయంలో మంచు మనోజ్ దంపతులు.. భక్తుల పొంగళ్లు

రేపటి జాతరకు 320 మందితో భద్రత

తిరుపతి(నేరవిభాగం), మే 11 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం జరగనుంది. డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో 320 మంది పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, 240 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు, హోంగార్డులు బందోబస్తు విధుల్లో ఉంటారు. ఆలయంలోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ ప్రధాన ద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి అనుమతించనున్నారు. క్యూలలో తొక్కిసలాట, తోపులాట జరగకుండా మూడు విభాగాలుగా విభజించారు. అనుమానితులు, పాత నేరస్థులు, చైన్ స్నాచర్లు, జేబు దొంగలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇప్పటికే 26 సీసీ కెమెరాలు, ఫింగర్ ప్రింట్ స్కానర్ ఏర్పాటు చేశారు.



→ ఆలయంలో తప్పిపోయిన బాలికను తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్న పోలీసులు

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 29,871 మందికి 64 కేంద్రాల ఏర్పాటు

తిరుపతి(విద్య), మే 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 24,336 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,535 మంది చొప్పున 29,871 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారని ఆర్ఐవో జి.వి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వీరికి 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో తిరుపతి నగరంలోనే 20 ఉన్నాయి. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రాల ప్రాంతాలకు ప్రయాణించొచ్చు. ఇక, అరగంట ముందునుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.





బంగారు పీఠంపై పద్మావతి అమ్మవారు - స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవారికి వసంతోత్సవాలు

తిరుచానూరు, మే 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు ఫ్రైడే గార్డెన్‌లో సుందరంగా తీర్చిదిద్దిన పచ్చని వాతావరణంలో శ్రీవారి పట్టపురాణి అలిమేలు మంగ వసంతోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు భక్తిరసంలో ఓలలాడించాయి. రాత్రి అమ్మవారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. సోమవారం ఉదయం అమ్మవారికి స్వర్ణ రథోత్సవం జరగనుంది. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టీటీడీ ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్ ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- 15 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీ జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 31వ తేదీ దరఖాస్తుకు చివరి గడువు. సమగ్ర సమాచారం కోసం అడ్మిషన్స్.తిరుమల.ఓఆర్‌జీ.. వెబ్‌సైట్ చూడవచ్చు.

రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్

తిరుపతి(నేరవిభాగం/సెంట్రల్), మే 11 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఉగ్ర ముప్పు నుంచి ప్రయాణికులు తమను తాము ఎలా రక్షించుకోవాలి? ఉగ్రవాదులు చొరబడితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి? విపత్కర పరిస్థితుల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలపై ఆదివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే సీఐ ఆశీర్వాదం నేతృత్వంలో పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో తిరుపతి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించడానికి తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ఈ మాక్‌డ్రిల్ సాగింది. రైల్వే హెల్త్ యూనిట్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ టీమ్‌లు చేపట్టాల్సిన అంశాలను సందీప్ కుమార్, ఆశీర్వాదం వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వి రమణ, పోతురాజు, సుబ్బరాజు, రాంబాబు, ధర్మేంద్ర రాజు, ఖాసీం, నదియా, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బాలాయపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి పంచాయతీ, కనుమరాయ కొండపై వెలసిన లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారి అభిషేకం చేశారు. మధ్యాహ్నం మహానివేదన జరిగింది. అన్నదానం, రాత్రి వేదమంత్రాల నడుమ ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బత్తల సుబ్బారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యం నాయుడు, పార్లపల్లి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి



క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గూడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏఆర్‌రెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏసీఏ సబ్‌సెంటర్‌లో క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, వ్యాయామం తప్పనిసరి అన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. డాక్టర్ జనార్దనరెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, మునిగిరీష్, మస్తానయ్య, నవీన్‌కుమార్, కోచ్ లవకుమార్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, రజనీకాంత్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ



క్రీడాకారులకు టీషర్టులను అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఆర్‌రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహిస్తున్న హాకీ శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో టీ షర్టులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ హాకీ కోచ్ దీపక్ ఆకాష్ అభ్యర్థన మేరకు క్రీడాకారులకు టీ షర్టులను అందజేయడం జరిగిందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రమేష్, లక్ష్మీనారాయణరెడ్డి, మురళీ నాయుడు, ప్రభాకర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నారాయణ, కోచ్ దీపక్‌ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మ ఆలయంలో మాతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మ కొలుపులో భాగంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద అమ్మవారి ముగ్గు, కంకణధారణ, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రికి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. తప్పెటు, తాళాలు, యువత చిందుల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని మాతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

గూడూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పాత కౌలు చట్టాన్ని రద్దుచేసి గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కౌలురైతుకూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు ఆర్థికసాయం అందజేయాలన్నారు. అలాగే పంటలకు మద్దతు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, లక్ష్మీపతి, దయాకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణరావు, బీవీ రమణయ్య, శంకరయ్య, ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు

గూడూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుకుంటూ జనసేన నాయకులు ఆదివారం పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. శత్రు సైన్యాలపై పోరాడుతున్న మన సైన్యానికి, దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాని మోదీకి భగవంతుని ఆశీస్సులు ఉండాలని పూజలు జరిపామన్నారు. కార్యక్రమంలో మోహన్, సాయికిరణ్, మనోజ్, మధుసూదన్‌రావు, జయదేవ్, మస్తాన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



పెంచలకోన ఆలయంలో జనసేన నాయకులు

బాలసదనంలో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గూడూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని బాలసదనం చిల్డ్రన్‌హోమ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికను భర్తీ చేయనున్నట్లు బాలసదనం సూపరింటెండెంట్ అరుణ ఆదివారం తెలిపారు. బాలసదనంలో కుక్, నైట్ వాచ్ ఉమెన్, ఎడుకేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9441990835 నంబరును సంప్రదించాలని సూచించారు.

'అన్నదాత సుఖీభవ' అర్హుల పేర్లు సరిచూసుకోండి

పెళ్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల వివరాలు గ్రామ సచివాలయాల్లో వీఏఏల వద్ద ఉన్నాయని, లబ్ధిదారులు పరిశీలించుకోవాలని మండల వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదిలో మూడు విడతలుగా రూ.20వేలు ఆర్థిక సాయం రైతులకు అందిస్తామని ఆమె చెప్పారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుపాడు గ్రామంలో నివాసం ఉంటున్న రమేష్(40) కుటుంబ కలహాల కారణంగా ఈ నెల 9వ తేదీ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రమేష్ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

నేటి నుంచి వేనాడులో మహాలక్షార్చన

సూళ్లూరుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): చైత్రపౌర్ణమి పురస్కరించుకొని వేనాడు దీవిలో వెలసిన శృంగీశ్వర శ్రీరంగపెరుమాల్ ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు మహాలక్షార్చన నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం స్వామివారికి మహాతిరుమంజనం, వస్త్రాలంకరణ, మహాలక్షార్చన, రాత్రి తిరుకల్యాణం, మంగళవారం పూలంగిసేవ, బుధవారం స్వామివారికి గంధాలంకారం నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు దీవి కుప్పుస్వామి తెలిపారు.







సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు - స్వామివారికి నిర్వహించిన సహస్ర దీపాలంకరణ సేవ - గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం

పెంచలో... గోవిందా..! నామస్మరణతో మార్మోగిన కోన గిరులు ● రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. కొండాకోనా.. ఎటుచూసినా భక్తజనం... ఎవరినోట విన్నా పెంచలో.. గోవిందా..! అనే నామస్మరణే. భక్తకోటి పిలుపుతో పెనుశిల నృసింహుడు పరవశించిపోయాడు. ఆదివారం రాత్రి స్వర్ణమయకాంతులతో వెలిగిపోతున్న గరుత్మంతుడిపై కొలువుదీరిన శ్రీవారు అశేష జనవాహినిని కటాక్షించారు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కోన కిక్కిరిసింది. పలువురు తలనీలాలు సమర్పించుకుని పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు.

సింహవాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పరిమళ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో శ్రీవార్లకు హోమాలు, స్నపనతిరుంజనం, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవ జరిగాయి.

బంగారు గరుడుడిపై ఊరేగింపు

పెనుశిల లక్ష్మీనరసింహుడు తన ఇష్ట వాహనమైన బంగారు గరుడుడిపై ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న పెంచలస్వామి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, వెంకటరామయ్య, హజరత్ నాయుడు, తోట కిష్టయ్య, భార్గవరాం, నరసింహరావు, సుగుణమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం తిరు కల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం 6గంటలకు రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు.



కోనలో శ్రీవారిని దర్శించుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల, నెల్లూరు ఆర్డీవో అనూష తదితరులు

బైక్‌ను ఢీకొన్న ఆటో: యువకుడి దుర్మరణం

మరో యువకుడికి తీవ్ర గాయాలు





ఘటనా స్థలం వద్ద విచారిస్తున్న ఎస్ఐ చిన్నబలరామయ్య - సుజిత్ కుమార్(ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తగుంట సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం బైక్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఉదయగిరి సుజిత్ కుమార్(22) అనే యువకుడ దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... కోట మండలం జరుగుమల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన ఉదయగిరి సుజిత్ కుమార్, శివ నాయుడుపేట మేనకూరు సెజ్‌లోని గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యారు. ఆదివారం ఉదయం డ్యూటీ దిగిన వీరు పరిశ్రమ వద్దే గదిలో గంట పాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. చిట్టమూరు మండల పరిధిలోని కొత్తగుంట సబ్‌స్టేషన్ సమీపంలో వెళ్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజిత్ కుమార్ తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శివ కాలు విరిగిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు సంఘటనా స్థలం నుంచి పరారయ్యారు. ఆ మార్గంలో వెళుతున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన శివను 108 వాహనంలో వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ బలరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సుజిత్ కుమార్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సాయంత్రానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, సుజిత్ తల్లిదండ్రులు బాబు, మంజుల షిరిడీ వెళ్లి ఆదివారం మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి కొడుకు మృతి చెందిన విషయం తెలిసి తల్లడిల్లపోయారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లైన్‌మన్ మృతి

తడ, మే 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ లైన్‌మన్ మృతి చెందాడు. సూళ్లూరుపేట నాగరాజపురానికి చెందిన కాదలూరు కిరణ్‌కుమార్(44) తడ సబ్ స్టేషన్‌లో పనిచేస్తుండేవాడు. ఈ నెల 8వ తేదీ రాత్రి విధులకు హాజరయ్యాడు. 9వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో బోడిలింగాలపాడు శివాలయం సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ కిరణ్‌కుమార్‌ను స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన లక్ష్మీనరసింహస్వామి



గరుడ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. సుప్రభాత సేవ, తిరుచ్చి ఉత్సవం, పుష్పాలంకరణ సేవ, విష్ణు, లక్ష్మీనరసింహ సహస్రనామ పారాయణం, హోమపూజలు జరిపారు. తిప్పగుంటపాళెం భక్తబృందం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గరుడవాహనంపై ఊరేగించారు. భక్తులు పాల్గొన్ని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. మేఘనూరు వెంకటకృష్ణయ్య, వెంకటశేషమ్మ, పొన్నలూరు రామచంద్రారెడ్డి, కవిత, యరటపల్లి శరణ్ కుమార్‌రెడ్డి, సాయిపృథ్వీరెడ్డి ఉభయదాతలుగా దంపతులు వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.





గంగమ్మ గ్రామోత్సవం - గంగపెట్టెతో సామూహిక పొంగళ్లు పెట్టేందుకు వెళుతున్న గ్రామస్తులు

గంగమ్మ గ్రామోత్సవం

కోట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాళెం గ్రామదేవత గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి సామూహిక పొంగళ్లు పెట్టారు. గంగపెట్టెతో మేళతాళాల మధ్య అమ్మవారికి పలు అభిషేకాలు చేశారు. వెంకన్నపాళెంలో అమ్మవారి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా అంకమ్మ కొలుపు



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ

వెంకటగిరి టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్టలో వెలసిన అంకమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి కొలుపు నిర్వహించారు. ఉదయం భక్తులు పొంగళ్లు పెట్టారు. కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కరిమాణిక్యస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతా మూర్తులను ఆహ్వానిస్తూ వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి శేషవాహన సేవ జరిగింది. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరి పాల్గొన్నారు.

రావులపాడులో ఎస్ఐ పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

పెళ్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపాడు గ్రామంలో ఆదివారం రాత్రి ఎస్ఐ నాగరాజు పల్లెనిద్ర చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్ఐ నాగరాజును టీడీపీ నాయకులు కొచ్చెర్ల వెంకటరమణ నాయుడు(కేవీ నాయుడు), బాలచంద్ర నాయుడు తదితరులు శాలువాలతో సత్కరించారు.

వైభవంగా నాగార్పమ్మ కొలుపు



ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ

నాయుడుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలో నాగార్పమ్మ కొలుపు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో నాగార్పమ్మ, మహాలక్ష్మమ్మ, నూకాలమ్మ, పోతురాజు, పరుశురామయ్య ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. రాత్రి మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల నడుమ ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. 60 సంవత్సరాల తరువాత నాగార్పమ్మ కొలుపు నిర్వహించడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంపాళెంలో ఆదివారం కవచ చారిటబుల్ ట్రస్టు అధినేత గుండు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిర నిర్వహించారు. వాసవి ఐ కేర్, నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గూడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్ పరిధిలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన నూర్‌బాషా(దూదేకుల) విద్యార్థులకు బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు నూర్‌బాషా సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. 10వ తరగతిలో 500, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకు పైగా సాధించిన నూర్‌బాషా విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోగా 9347701154 నంబరును సంప్రదించాలన్నారు.

వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, శంకరయ్య తదితరులు

సూళ్లూరుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెముత్తేరిలో ఉన్న సాయి సేవా వృద్ధాశ్రమంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు మస్తాన్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొని ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. మాతృమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, నాయకులు మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి, పెంచలయ్య, శ్రీధర్, కొండల్‌రావు, డాక్టర్ పరుచూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోండి

చిల్లకూరు, మే 11 (ఆంధ్ర జ్యోతి): ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా రామచంద్రారెడ్డి, నెల్లూరు రామ్మూర్తి, బెల్లంకొండ రాజేంద్ర, మల్లికార్జున్, సురేష్‌బాబు, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, మే 11 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. వేద పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకారంలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.